క్లుప్తంగా

ధర్మ సమాజ్ పార్టీ ఎన్నికల ప్రచారం



జంగపల్లిలో ప్రచారం చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు మహారాజ్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో ధర్మ సమాజ్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నె లక్ష్మణ్‌కు మద్దతుగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు మహారాజ్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెప్పుల గుర్తుకు ఓటు వేసి లక్ష్మణ్‌ను గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, దీపక్, కనకయ్య, చంద్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ శంకర్‌కు పితృ వియోగం



నివాళి అర్పిస్తున్న చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తండ్రి మరణించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదివారం మండల పరిధిలోని లింగుపల్లిలో శంకర్‌ను పరామర్శించి ఓదార్చారు. శంకర్‌ను పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, సూకూరి లింగం, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ నంట బాపురెడ్డి, మాజీ చైర్మన్ చందపురం మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ సర్పంచ్ జోగ్గారి బాల్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో అధికారులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై హార్టికల్చర్ అధికారులు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, మండల అధికారి మమత, అధికారులు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శంకర్, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటువేసి కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టణ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు చేర్యాల పట్టణ పరిధిలోని పలువార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ చెవిటి లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



రజనీకాంత్‌ను ఎన్నుకుంటున్న సభ్యులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండల, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి సంతోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గజ్వేల్ మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రజనీకాంత్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్లు జార్జిరెడ్డి, షణ్ముకానందం, కృష్ణ, శ్రీనివాస్, పవన్‌కుమార్, సుధాకర్, స్వామిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం పోరాటం

సిద్దిపేటకమాన్: రైతుల కోసమే పోరాటం చేస్తున్నామని, నా ఫోన్‌ట్యాప్ చేశారని కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. ఫోన్ల ట్యాపింగ్‌పై తన వద్ద ఆధారాలున్నాయన్నారు. సిద్దిపేటలోని కొంత మంది వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ అయినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు తనను విచారించినట్లు చెప్పారు. సుడా పరిధిలో నివేదికను తయారు చేసి త్వరలో సీఎంకు అందజేస్తామన్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- దిగుమతి చేసుకోవడంలో మిల్లర్ల జాప్యం
- ఎండల తీవ్రతకు 10 గంటల వరకే తూకం
- రోజుకు ఒక లారీ మాత్రమే లోడింగ్
- కేంద్రాల్లో రైతుల పడిగాపులు



పెద్దకోడూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. కోతలు పూర్తి చేసిన రైతులు తేమ శాతం తెలుసుకునేందుకు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు. నిర్దీత శాతం లేకపోతే ధాన్యం ఆరబోసి తూకం కోసం ఎదురు చూస్తుంటారు. ఇలా కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. రైతులు కేంద్రాల నిర్వాహకులను ప్రశ్నిస్తే మిల్లర్లు ధాన్యం దించుకోవడంలో జాప్యం చేస్తున్నారని చెబుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటంతో రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎండల తీవ్రతకు హమాలీలు ప్రతీరోజు ఉదయం 10 గంటల వరకే ధాన్యం తూకం వేస్తుండటంతో కొనుగోళ్లలో జాప్యానికి మరో కారణం. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాల భయంతో వరి పచ్చిగా ఉన్నప్పుడే కోసిన వారు ధాన్యం ఆరబెట్టేందుకు పొద్దంతా కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఇవ్వాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రాలకు తరలించిన ధాన్యం తేమ శాతం తెలుసుకునేందుకు రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. నిబంధనల మేరకు తేమ శాతం తగ్గితే కేంద్రాల వద్దే ఆరబోస్తున్నారు. దీంతో రోజుల తరబడి వేచి చూడాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు. అయితే కేంద్రాల నిర్వాహకులు మాత్రం మిల్లర్లు దిగుమతి చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారని చెబుతున్నారు. అకాల వర్షం కురిస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కనీసం టార్పా లిన్లు ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు.

పదిహేను రోజులవుతోంది



నేను ధాన్యం తెచ్చి పదిహేను రోజులవుతోంది. ఎండబోసి తూర్పారబట్టిన. కాంటా వేయడంలో ఆలస్యం అవుతోంది. వరుస ప్రకారం కాంటాపెడుతున్నా రోజుకు ఒక లారీ మాత్రమే తూకం వేస్తున్నారు. దీంతో రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తూకంలో వేగం పెంచాలి.

– వరుకోలు రాజు, పెద్దకోడూరు

మిల్లర్ల వద్దే జాప్యం

తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంట వెంటనే మిల్లర్లకు తరలిస్తున్నాం. అక్కడ ధాన్యం బస్తాలను దింపుకోవడంలో జాప్యం జరుగుతోంది. దీనికి తోడు తూకంలో కొంత ఆలస్యం అవుతోంది. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి.

– శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ కమ్యూనిటీ కోఆర్డినేటర్, పెద్దకోడూరు

చిరిగిన గోనె సంచులతో..

కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన గోనె సంచులు చిరిగిపోవడంతో హమాలీలు ఇబ్బందులు పడుతున్నారు. గోనె సంచులు చిరిగిపోతే అప్పటికప్పుడు కుట్లు వేయాల్సి వస్తోందంటున్నారు. లారీల్లో ధాన్యం బస్తాలను లోడ్ చేసిన తరువాత పాత సంచులు చిరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్తవి ఇవ్వాలని కోరుతున్నారు.

పోలింగ్ అవగాహనకు 5కె రన్



5కె రన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్ రవీందర్ రెడ్డి

హుస్నాబాద్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఓటరు అవగాహన కోసం 5కె రన్ నిర్వహించారు. తహసీల్దార్ రవీందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైందన్నారు. అర్హులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. మే 13వ తేదీన నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

ఓటింగ్ నమోదు శాతం పెంచేలా..

దుబ్బాకటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని ఓటింగ్ నమోదు శాతం పెంచాలని దుబ్బాక తహసీల్దార్, ఏఆర్ఓ వెంకటరెడ్డి అన్నారు. స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా 'ఓట్ ఫర్ ష్యూర్..రెడీ టూ ఓటు' అనే నినాదంతో ఆదివారం దుబ్బాకలో 5 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటు ప్రాముఖ్యతను వివరించి యువకులతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు.

ఉచితాల పేరుతో కాంగ్రెస్ మోసం



వెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ఆదివారం నంగునూరు మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పార్టీకి బ్రహ్మరథం

మర్కూక్(గజ్వేల్): గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని భారీ మెజార్టీతో వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, బీఆర్‌ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కర్కపట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని కోరారు.

గజ్వేల్‌రూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని, త్వరలో జరగనున్న మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో ఆదివారం వెంకట్రామ్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉచితాల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి, బీఆర్‌ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న చైర్ పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీగా అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ నాయకులు పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ సతీష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి ఓటుహక్కు వినియోగించుకోవాలి

దుబ్బాక సీఐ శ్రీనివాస్



దుబ్బాక: ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి ఈసీ కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేసే విషయంలో సమాజాన్ని జాగృతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వినియోగించుకోండి

హుస్నాబాద్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫెసిలిటేషన్ సెంటర్స్ నడపాలని నిర్ణయించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రామ్మూర్తి ఆదివారం తెలిపారు. హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం కూడా సాయంత్రం 6 గంటల వరకు నడుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 8వ తేదీలోపు తమఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

హామీలు నెరవేర్చని పార్టీలను ఓడించండి

అక్కన్నపేట (హుస్నాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్, కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కోడలు ఆశ్రిత అన్నారు. ఆదివారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో వినోద్ కుమార్‌కు మద్దతుగా పార్టీ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా మంగ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసర సాంబరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవక్కపల్లెలో..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వినోద్‌కుమార్ కోడలు ఆశ్రిత

చిరు వ్యాపారులను పలకరిస్తూ..

కోహెడ(హుస్నాబాద్): బీఆర్‌ఎస్ పార్లమెంట్ కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కోహెడలో ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులను అప్యాయంగా పలకరిస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి పాల్గొన్నారు.

విడదీయాలని చూస్తే సహించం



మాట్లాడుతున్న నారాయణ

నంగునూరు(సిద్దిపేట): స్వార్థ ప్రయోజనాల కోసం ముదిరాజ్ కులాన్ని విడదీయాలని చూస్తే సహించేది లేదని ఆ సంఘం మండల అధ్యక్షుడు పిల్లి నారాయణ అన్నారు. ఆదివారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ ఐకమత్యంగా ఉన్న తమ సంఘాన్ని ఇతర కులస్తులు విడదీసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. మండల సంఘాన్ని అన్ని గ్రామాల అధ్యక్షులు కలిసి ఎన్నుకునే సాంప్రదాయం ఉందని, ఇందుకు భిన్నంగా సంఘంలో ఎలాంటి హోదా లేని వ్యక్తి తానే మండల అధ్యక్షుడిని అని ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్‌ని గెలిపించండి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న గోపాలస్వామి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ప్రజల పక్షాన పోరాడే సీపీఎం భువనగిరి అభ్యర్థి జహంగీర్‌ని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, మెండిచింత కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహంగీర్‌ని గెలిపించి పార్లమెంటుకు పంపాలన్నారు. ప్రచార కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుధాకర్, నాగరాజు, అరుణ్, శోభ, రమ, శ్రీహరి, మల్లేశం, చందు, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజా సమస్యల కోసం పోరాడే సీపీఎం భువనగిరి అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. ఆదివారం జహంగీర్‌కు మద్దతుగా మండలంలోని పోసాన్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పార్టీలను ఓడించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ అడ్రస్ గల్లంతే

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

దుబ్బాక: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి నీలం మధు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, గొల్ల కురుమ డోల్‌దెబ్బ రాష్ట్ర నాయకుడు బాల్తె వెంకటేశంతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ పాత్కుల లీలాదేవి భర్త వెంకటేశం తోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. దుబ్బాక క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వీరికి పార్టీఈ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటు పడుతుందన్నారు.

కొండపాక(గజ్వేల్): అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో జరిగిన బూత్ కమిటీ సమావేశంలో మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15 లోపల అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన రైతు రుణమాఫీ హామీ నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజలను పట్టించుకోని బీఆర్‌ఎస్, బీజేపీలకు ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని మెట్‌పల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో ముదిరాజ్‌లకు గౌరవం

ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్



మాట్లాడుతున్న జగన్మోహన్

వర్గల్(గజ్వేల్): ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీలో సముచిత గౌరవం దక్కిందని, మెదక్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్ అభ్యర్థిత్వం చారిత్రాత్మకమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం వర్గల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముదిరాజ్ మండల సంఘ అధ్యక్షుడు శ్రీరాం నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై ప్రసంగించారు. ముదిరాజ్ సమాజానికి ఇది పరీక్షా సమయమని, నీలం మధును గెలిపించుకొని భావితరాలకు బంగారు బాటలు వేద్దామని, సంఘటితత్వంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

నీలం మధును గెలిపించాలి

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి

గజ్వేల్: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు భారీ మెజార్టీని సాధించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి కోరారు. ఆదివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ, కొడకండ్ల గ్రామాల్లో నీలం మధుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని పార్టీలను ఓడించాలి

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పెద్దమ్మ పెద్దిరాజు ఉత్సవాలు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండల కేంద్రమైన తొగుటలో శ్రీపెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీపోచమ్మకు బోనాలు సమర్పించారు. సోమవారం శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు.

◆ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని పాలమాకులలో వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఉత్సవమూర్తుల ఊరేగింపు, పల్లకీసేవ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. ఈ సందర్భంగా శేషఫణి ఆచార్యులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయ ద్వాదశ వార్షికోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపల్లి గ్రామానికి చెందిన పబ్బతి అపరంజి 10వ తరగతిలో 9.5 జీపీఏ సాధించి పాఠశాలలో టాపర్‌గా నిలిచింది. అదే గ్రామానికి చెందిన ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ దారం అశోక్‌రెడ్డి ఆదివారం ఆమెకు రూ.10 వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని యూత్ కాంగ్రెస్ గజ్వేల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె కృపానందం అన్నారు. కొండపాక మండలం సిర్సనగండ్లకు చెందిన క్రాంతి అంబేద్కర్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైనందుకు ఆదివారం గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు సుదీర్‌రెడ్డితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ తుప్పతి అంజియాదవ్, నాయకుడు అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ కార్మికుడి మృతి

అక్కన్నపేట (హుస్నాబాద్): మండలంలోని రామవరం గ్రామానికి చెందిన పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుడు లింగాల కనకయ్య (47) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి కనకయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చినట్లు ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ తెలిపారు.

◆ బీజేపీకి ఆదరణ పెరుగుతోంది

నంగునూరు(సిద్దిపేట): మోదీ చరిష్మాతో గ్రామాల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం నర్మేట, పాలమాకుల, తిమ్మాయిపల్లి గ్రామాల్లో బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు.

◆ కరీంనగర్ ఎంపీగా గెలిపించాలి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి రేఖ, కుటుంబసభ్యులు బెజ్జంకిలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి, సాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని, రాజేందర్‌రావుకు ఒక అవకాశమివ్వాలన్నారు.

◆ కాంగ్రెస్‌తోనే సంక్షేమం

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి, వీరాపూర్, బేగంపేట తదితర గ్రామాల్లో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

◆ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడి నియామకం

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బెజ్జనమైన ప్రవీణ్ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం దుబ్బాక క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలతో పాటు కాంగ్రెస్ పటిష్టతకు తనవంతు కృషిచేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ కార్యదర్శి తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింలు, అనిల్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.